ప్రజాశక్తి

మంగళవారం 25 నవంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బెంగళూరు టు విశాఖ

ఐటి సంస్థల ఆగమనం

- స్థలాల కేటాయింపులతో పలువురు ఆసక్తి
- ప్రభుత్వ తాజా ఐటి ప్రతిపాదనలతో

రూ.10,500 కోట్ల పెట్టుబడులు

ఐటి హిల్స్‌లోని మిలీనియం టవర్స్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాగల మూడేళ్లలో విశాఖ నగరానికి దేశంలోని ప్రముఖ ఐటి సంస్థలు రాబోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఇబ్బడి ముబ్బడికే ఆయా సంస్థలకు భూ కేటాయింపులు జరిగాయి. ఇవేగనక క్షేత్రస్థాయిలో వస్తే విశాఖ రూపురేఖలు మారతాయన్న ఆశాభావం నిరుద్యోగ, చదువుకున్న యువతలో కనిపిస్తోంది. ముఖ్యంగా బెంగళూరు కేంద్రంగా పనిచేసే పలు కంపెనీలు విశాఖకు రాబోతున్నట్లు తెలుస్తోంది. బెంగళూరులో ట్రాఫిక్ అవస్థలతో ఐటి సంస్థలకు వెళ్లి వచ్చేందుకు ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను తగ్గించుకునేందుకు పలు సంస్థలు తమ తదుపరి ఐటి కార్యకలాపాలను విశాఖ వైపు మార్చుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది.

అత్యంత భారీ పెట్టుబడితో తర్లువాడలో రాబోయే గూగుల్ డేటా ప్రాజెక్టును మినహాయిస్తే విశాఖకు పలు ఐటి కంపెనీల రాకకు సంబంధించి ప్రభుత్వ స్థల కేటాయింపుల్లో వేగం పెరగడంతో పలు సంస్థలు ఇటు వైపు చూస్తున్నాయి. గూగుల్ సంస్థకు తర్లువాడలో 300 ఎకరాలు డేటా సెంటర్ కోసం, అడవివరంలో 120, రాంబిల్లిలో 165 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. రుషికొండ హిల్ నెంబర్ 4పై అదానీకి 130 ఎకరాలు ప్రభుత్వం భూమిని కేటాయించినప్పటికీ అదానీ ఈ స్థలానికి ఫెన్సింగ్ వేసుకోవడం మినహా ఐటి పనులు ఇంతవరకూ ప్రారంభం కాలేదు. సుమారు రూ.14,634 కోట్లతో 24,990 మందికి 2030లోగా ఉపాధి కల్పించాలని అదానీ డేటా సెంటర్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎ.సింహాచలం ప్రజాశక్తికి తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వం తాజాగా చేసిన కేటాయింపుల ప్రకారం.. రూ.10500 కోట్ల పెట్టుబడులతో 1.10 లక్షల కొత్త ఉద్యోగాలు విశాఖ కేంద్రంగా ఐటి కంపెనీల్లో రాబోతున్నాయని వెల్లడించారు.

ఏయే సంస్థలకు ఎంతెంత కేటాయింపులు?

రుషికొండ ఐటి హిల్ నెంబర్ 3లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) సంస్థకు 21 ఎకరాలను కేటాయింపులు చేశారు. కాగ్నిజెంట్‌కు 22 ఎకరాలు, ఫార్చ్యూన్ - 500 లిస్ట్ మిగతా 2లో..

అవినీతి, అక్రమాల

గుర్రాల పార్కును ఉపసంహరించుకోవాలి

సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంగారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అవినీతి, అక్రమాల గుర్రాల పార్కు పున : ప్రతిపాదనను ఉపసంహరించాలని, గతంలో జివిఎంసి కౌన్సిల్ చేసిన నిర్ణయాన్ని అమలు చేయాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావుకు తాను రాసిన లేఖను అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముడసర్లోవ పార్కులో 2023లో జివిఎంసి కౌన్సిల్‌లో ఆమోదం లేకుండానే అక్రమంగా రూ.6 కోట్ల నిధులతో గుర్రాల స్వారీ శిక్షణా పార్కు నిర్మాణం చేపట్టారన్నారు. కౌన్సిల్ సభ్యులకు తెలియకుండానే భారీగా ముడుపులు తీసుకొని రూ.3 కోట్లను నిబంధనలకు విరుద్ధంగా ప్రథు అసోసియేట్ అనే సంస్థకు చెందిన కాంట్రాక్టర్‌కు ఇచ్చేశారన్నారు. 2024 డిసెంబర్ 11న జరిగిన జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో గుర్రాల పార్కు అక్రమాలపై తీవ్ర చర్చ జరిగిందన్నారు. అందులో కొందరికి భారీగా ముడుపులు ముట్టాయని, ఈ ప్రాజెక్టు కౌన్సిల్ ఆమోదం లేకుండా చేపట్టడం చట్ట ధిక్కారం అని పేర్కొంటూ ఈ ప్రాజెక్టును రద్దు చేస్తూ తీర్మానం చేయడమైనదన్నారు. అంతేగాక అక్రమంగా కాంట్రాక్టర్‌కు ఇచ్చిన రూ.3 కోట్లు అడ్వాన్స్ చెల్లింపులు తిరిగి వసూలు చేయాలని, అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, సమగ్ర విచారణ చేపట్టేందుకు అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో కమిటీ వేయాలని నిర్ణయించామన్నారు. ఆ తరువాత వైసిపి మేయర్‌ను మార్చి తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి నుంచి పీలా శ్రీనివాసరావు మేయర్‌గా ఎన్నికయ్యారని, ఆయన పదవి చేపట్టి ఏడాది కాలం కూడా పూర్తి అయ్యిందని అన్నారు. కానీ కాంట్రాక్టర్ నుండి రూ.3 కోట్లు వసూలు చేసే చర్యలు ప్రస్తుత మేయర్ చేపట్టలేదన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. కనీసం ఈ అక్రమ గుర్రాల పార్కుపై విచారణ కమిటీ కూడా వేయలేదన్నారు. ఇప్పుడు ఉన్న మేయర్ గతంలో రద్దు చేసిన గుర్రాల స్వారీ పార్కును చేపట్టడానికి మిగతా 2లో..

ఇకపై ఫోన్‌పేలో ట్రాఫిక్ చలానా చెల్లింపు

వార్త 2లో..

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కు శంకుస్థాపన

వార్త 4లో..

ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

వార్త 4లో..

అనకాపల్లి కలెక్టరేట్ ఎదుట నినదిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

రెగ్యులరైజేషన్‌కు ఎస్ఎస్ఎ ఉద్యోగుల ధర్నా

విశాఖ, అనకాపల్లి కలెక్టరేట్లలో వినతులు

వార్త 8లో..

27, 28న జాతీయ స్థాయి సదస్సులు

పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, అధికార యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్ వేదికగా మూడు ప్రధాన కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, నోడల్ ఏజెన్సీలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ బాల్ వివాహ్ ముక్త్ భారత్ (బివిఎంబి) తాలూక ప్రత్యేక నేపథ్య ఔట్రీచ్ ప్రచారాన్ని 27న విశాఖపట్నంలో ప్రారంభిస్తోందని, ఇది దేశవ్యాప్తంగా 100 రోజుల పాటు కొనసాగుతుందని అన్నారు. అదే రోజు మధ్యాహ్నం సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సిఎఆర్ఎ), నేషనల్ అడాప్షన్ అవేర్‌నెస్ కాన్‌క్లేవ్‌ను నిర్వహిస్తోందని, దీనికి సారా, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు (డిసిపియులు), అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ప్రాస్పెక్టివ్ అడాప్టివ్ పేరెంట్స్ (పిఎపిలు) ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. అలాగే 28న మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న పార్లమెంటు సంప్రదింపుల కమిటీ (సిసిపి) ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తోందని, కేంద్ర మంత్రులు, ప్రముఖులు, సీనియర్ ప్రభుత్వ అధికారులు భాగస్వామ్యం అవుతారని తెలిపారు. వీటి ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయాలన్నారు.

అతిథుల రాక నిమిత్తం సంబంధిత ఏర్పాట్లు పక్కాగా చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం వాహనాలను ఏర్పాటు చేయాలని, లైజన్ అధికారులను నియమించాలని చెప్పారు. విమానాశ్రయంలో శాస్త్రీయ నృత్య కళాకారుల సాయంతో సంప్రదాయ స్వాగత ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రముఖులందరికీ నిర్దేశించిన ప్రొటోకాల్ ప్రకారం బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు అందించాలని, ట్రాఫిక్ క్లియరెన్స్ ఏర్పాట్లను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఐటి సంస్థల ఆగమనం

కంపెనీల కోసం, ఫినాం పీపుల్ ఐటి సంస్థకు పరదేశిపాలెంలో 25 ఎకరాలు, ఐటి హిల్ నెంబర్ 4పై సత్వకు 30 ఎకరాలు, కపిల్ గ్రూప్ బివిఎం (డబ్ల్యుటిసి)కి 10 ఎకరాలు, భవనాలు నిర్మాణం చేసే గ్లోబల్ సంస్థ అయిన ఎఎన్ఎస్ఆర్‌కు 10 ఎకరాలు హిల్ నెంబర్ 3, 4పై కేటాయింపులు చేశారు. దీనికి హిల్ నెంబర్3లో 2.5 ఎకరాలు, హిల్ నెంబర్ 4పై 7.5 ఎకరాలు కేటాయించారు. పరదేశిపాలెంలో సిఫీ కంపెనీకి 25 ఎకరాలు, రుషికొండ హిల్ నెంబర్ 2లో మరో 3.5 ఎకరాలకు గడచిన కొద్దినెలలుగా రాష్ట్ర కేబినెట్ నేరుగా అనుమతులను మంజూరు చేసింది. వీటిలో పలు ఐటి సంస్థలు బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్నవే. గడచిన కొద్ది సంవత్సరాలుగా అక్కడ ట్రాఫిక్ ఫ్రీ లేకపోవడం ఐటి కంపెనీల కార్యకలాపాలకు కొంత ఆటంకం ఏర్పడుతోంది. దీంతో విశాఖను ఎంచుకుంటున్నట్టు పలువురు చెబుతున్నారు.

27, 28న జాతీయ స్థాయి సదస్సులు

పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రెజెంటేషన్ల కోసం వేదికలో ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాట్లు, రెండు రోజుల కార్యక్రమాలలో ఐటి, డిజిటల్ సాంకేతిక సిబ్బందిని నియమించడం, అవసరమైన అన్ని సాంకేతిక ఏర్పాట్లు చేసుకోవాలని, కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారం కోసం ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలను దత్తత తీసుకోవడం అనే లఘు చిత్ర ఏర్పాటు ప్రారంభోత్సవం, ప్రదర్శనకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేదిక వద్ద అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రముఖులు, భారత ప్రభుత్వ సీనియర్ అధికారులు, ప్రత్యేక అవసరాలుగల పిల్లల కుటుంబాలకు ఆలయ సందర్శనలు, స్థానిక పర్యాటక ప్రాంతాల సందర్శనకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కార్యక్రమాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

గుర్రాల పార్కును ఉపసంహరించుకోవాలి

ప్రతిపాదించే చర్యలు చేపట్టారన్నారు. గుర్రాల పార్క్ కాంట్రాక్టర్ మేయర్‌ను కలిసిన తరువాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందన్నారు. గతంలో తెలుగుదేశం కార్పొరేటర్లందరూ దీనిని వ్యతిరేకించిన విషయాన్ని గంగారావు గుర్తుచేశారు. ఇప్పుడు అదే పార్టీకి చెందిన మేయర్ ముందుకు తీసుకురావడం వెనుక గతంలో వలే భారీ ముడుపులకు లొంగి ఈ ప్రజా వ్యతిరేక చర్యకు పాల్పడినట్లు స్పష్టమౌతోందని ఆరోపించారు. ఇది మేయర్‌కు, తెలుగుదేశం కూటమికి తగని పని అని గంగారావు పేర్కొన్నారు. గుర్రాల స్వారీకి ముడసర్లోవ పార్క్‌లోని స్థలంలో సుమారు నాలుగు ఎకరాలు కేటాయించారన్నారు. ఆ భూమి విలువ సుమారు రూ.200 కోట్లు ఉంటుందన్నారు. పార్కు స్థలాల్లో శాశ్వత కాంక్రీట్ నిర్మాణాలు, గుర్రాల స్వారీ ప్రాజెక్టులు వంటివి చేపట్టకూడదని తెలిపారు. ఈ పార్క్‌ను పదేళ్ల పిపిపి కింద ప్రైవేట్ సంస్థకు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోందన్నారు. అలాగే గుర్రాల స్వారీ శిక్షణకు నెలకు రూ.15 వేలు నుండి రూ.20 వేలు ఫీజు వసూలు చేస్తారని, నిత్యం గుర్రాల స్వారీ జూదం నిర్వహిస్తారని తెలిపారు. కేవలం ధనవంతుల అవసరాల కోసం, రాజకీయ ముడుపుల కోసం, కాంట్రాక్టర్ లాభాల కోసం ముడసర్లోవ పార్కును అక్రమంగా కాంట్రాక్టర్‌కు ధారాదత్తం చేయడాన్ని విశాఖ ప్రజలెవరూ హర్షించరని గంగారావు పేర్కొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో మొట్టమొదటిసారి సిఐటియు అఖిల భారత మహాసభలు జరుగనున్నాయని, వాటిని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో సోమవారం మహాసభల పోస్టర్‌ను సిఐటియు జిల్లా నాయకత్వంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 1600 మంది కార్మిక ప్రతినిధులు హాజరవుతారన్నారు. జనవరి 4న లక్ష మందితో ఆర్‌కె బీచ్‌లో ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతాయన్నారు. దీనికి ముందు డిసెంబర్ 27 నుంచి జనవరి 2 వరకు 'శ్రామిక ఉత్సవ్' పేరుతో సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాటాలను రూపొందించడం మీద మహాసభలో చర్చ జరుగుతుందన్నారు. ఇప్పటికే మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలను మార్పు చేసి యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. మహాసభల జయప్రదం కోసం విశాఖలోని కార్మికులు, ప్రజలు, శ్రేయోభిలాషులు తమ పూర్తి సహాయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, నాయకులు పి.వెంకటరెడ్డి, అయోధ్యరామ్, బి.మేరీ, పి.మణి, బి.జగన్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌పై మెడికల్ రిప్స్ నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలంటూ మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యాన సోమవారం అఫీషియల్ కాలనీలో ఉన్న సంఘం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. లేబర్ కోడ్స్ ప్రతులను దగ్ధం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు పివి.సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి డి.స్రవంత్ మాట్లాడారు. ఈ నెల 21 నుండి కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకు పూనుకుందని, ఇది కార్మికులకు బ్లాక్ డే వంటిదని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలతో పాటు సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్, వర్కింగ్ జర్నలిస్ట్ చట్టం, సినీ కార్మికుల చట్టం వంటి అనేక చట్టాలను బిజెపి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. మోడీ సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంజయ్ కుమార్, కిరణ్ కుమార్ చౌదరి, సన్యాసిరావు, శ్రీనివాసరావు, రామారావు, కళాధర్, అప్పారావు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

ప్రతులను దహనం చేసిన మెడికల్ రిప్స్

లేబర్ కోడ్స్ రద్దుకు 26న అఖిలపక్షాల ర్యాలీ

కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దగల లలితా జ్యూయలర్స్ నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన జరుగుతుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

29న సూపర్ బజార్ మహాజన సభ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్ (సూపర్ బజార్) మహాజన సభ శనివారం ఉదయం 11 గంటలకు సూపర్ బజార్ ఆవరణలో జిల్లా జాయింట్ కలెక్టర్, పర్సన్ ఇన్‌చార్జి మయూర్ అశోక్ అధ్యక్షతన జరుగుతుందని, కావున సంఘం సభ్యులు హాజరు కావాలని సూపర్ బజార్ మేనేజింగ్ డైరెక్టర్ పి.శ్రీరామమూర్తి మీడియాకు తెలిపారు.

మహాసభలో వ్యాపారాభివృద్ధిపై చర్చిస్తామన్నారు. 2023-2024 సంవత్సరం ఆడిట్ తుది నివేదిక ఆమోదించడం, 51 ఎంక్వయిరీ రిపోర్టుల ఆమోదించటంతో పాటు అధ్యక్షులు అనుమతితో ఇతర విషయాలు ఉంటాయన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీకి విశాఖ జట్టు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: టీ 10 టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరగబోయే రెండో జూనియర్ నేషనల్ అండ్ ఫెడరేషన్ కప్ టీ10 టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్‌లో విశాఖపట్నం నుండి 16 మంది క్రీడాకారులు ఎంపికైనట్టు జిల్లా సెక్రటరి కె.విజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో విశాఖకు చెందిన క్రీడాకారుల్లో బిట్స్ (బాబా ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) కళాశాలకు చెందిన విద్యార్థులుఉన్నట్లు తెలిపారు. హిమాచల్ ప్రదేశ్, హామీర్ పూర్‌లో ఈ నెల 28 నుండి 1 వ తేదీ వరకు జరిగే పోటీలకు బిట్స్ వైజాగ్ కళాశాల జట్టు నేడు హిమాచల్‌ప్రదేశ్‌కి బయలుదేరింది. ఈ జట్టుకి టి.హవిష్ నాయుడు, ఎం.పవన్‌కుమార్ కెప్టెన్, వైస్ కెప్టెన్‌గా వ్యవ హరిస్తున్నట్లు ఆయన తెలిపారు. బిట్స్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్. కె. శ్రీలక్ష్మి ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ జెర్సీని అందజేశారు.

ప్రజాదర్బార్ వినతులకు ప్రాధాన్యం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ప్రజాదర్బార్‌కి వచ్చిన వినతులను నిశితంగా పరిశీలించి, వాటిని పరిష్కరించటానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ ప్రణవ్‌గోపాల్ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్‌భరత్ పాల్గొని పిటిషనర్ల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా వినతులకు సంబంధించి అధికారులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన మధ్యతరగతి ప్రజలకు వాటిని క్రమబద్ధీకరించుకొనే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, ఎల్ఆర్ఎస్- 2020 పథకానికి కొనసాగింపు కల్పించిందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కి ప్రణాళిక ఎ 9, పరిపాలనా - 2, ఎస్టేట్ 2, సాంకేతిక 1 మొత్తంగా 14 వినతులు వచ్చాయి. సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా భాషా సంఘం ప్రకటన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తూతూ మంత్రంగా భాషా సంఘాన్ని ప్రకటించి చేతులు దులుపుకుందని తెలుగు దండు అధ్యక్షుడు పరవస్తు సూరి ఆరోపించారు. మాతభాష మనుగడ కోసం తెలుగుదండు సంకల్పించిన టిట్టిభ సత్యాగ్రహం 15 వ రోజైన సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగింది. కవులు, కళాకారులు, భాషాభిమానుల సందడితో,ఆటపాటలతో ఉత్తేజితంగా సాగింది. ఈ సందర్భంగా పరవస్తు సూరి మాట్లాడుతూ, తెలుగు భాషను కాపాడి భావితరాలకు భద్రంగా అందించే సత్తా కలిగిన మాతృభాషాభివద్ధి ప్రాధికార సంస్థ కావాలన్నారు. ప్రభుత్వ దిక్కుమాలిన రాజకీయ ఎత్తుగడలు తెలుగుభాష మీద ప్రయోగించవద్దన్నారు. మాతభాషా ద్రోహులు,దేశద్రోహుల కంటే నీచులు, ప్రమాదకారులు అంటూ ధ్వజమెత్తారు. ఈ నిరసన దీక్ష 24 నుంచి విశాఖలో విరమించి, విజయవాడలో కొనసాగిస్తామన్నారు. తెలుగుదండు నిక్కచ్చులు సాధించుకునేంతవరకూ దీక్ష విరమించేది లేదని, ప్రజాఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

బాదంగీర్ సాయికి నివాళులు

దీక్షా వేదికపై కవులు, కళాకారుల ఆధ్వర్యంలో నాటకరంగానికి ఎన్నో అపురూప సేవలందించిన, దివంగత బాదంగీర్ సాయికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాదంగీర్ సాయి భార్య హైమావతి, కుమారుడు వీరేశుబాబు పాల్గొన్నారు.

ఇకపై ఫోన్‌పేలో ట్రాఫిక్ చలానా చెల్లింపు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: వాహనదారుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ ఉల్లంఘన చలానాలు చెల్లించే విధానాన్ని విశాఖపట్నం ట్రాఫిక్ పోలీసులు మరింత సులభతరం చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇకపై వాహనదారులు తమ మొబైల్‌లోని ఫోన్‌పే ద్వారా కేవలం కొన్ని సెకన్లలోనే తమ చలాన్లను చెల్లించుకోవచ్చునని తెలిపారు. ఇంతకుముందు వాహనదారులు చలానాలు చెల్లించడానికి ఎంపరివహన్ యాప్‌లో కొంత సమయం వెచ్చించాల్సి వచ్చేది. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి, ఫోన్ పే యాప్‌లో ప్రత్యేకంగా ఈ-చలన్ అనే కొత్త ఐకాన్‌ను ఎనేబుల్ చేయడం జరిగిందని తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఆర్టీసీలో ఉద్యోగోన్నతులు పొందిన ఉద్యోగులంతా మరింత అంకితభావంతో సేవలందించాలని విశాఖపట్నం జిల్లా ప్రజారవాణా అధికారి బి.అప్పలనాయుడు సూచించారు. విశాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి, వివిధ డిపోల్లో పనిచేస్తున్న 24 మంది అసిస్టెంట్ డిపో క్లర్కులకు, డిపో క్లర్క్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ 3లుగా ఉద్యోగోన్నతులు ఇచ్చి, వారి అభ్యర్ధన మేరకు, వివిధ ఖాళీలను బట్టి వారికి డిపోలు కేటాయించారు.

In the Honorable Court of the 10th Additional District Judge come MACT at Anakapalli.
M.V.O.P 415/2024
Between
Tamminaina (Atta)Lakshmi Bavant ...Petitioner.
And
Bypureddy Srinu and Others ...Respondents.
NOTICE
To,
Respondent-2.
M/S Madhuri Logistics and Contractors, Represented by Inumula Seshaveni, Owner of Coal lorry bearing registration No AP 39 TG 6363.residing at D. No 26-1-1/8. Opposite Gajuwaka Police Station. Chinagantyada, Gajuwaka, Visakhapatnam -26.
Please take notice that the above named petitioner filed the above M.V.O.P against you for claiming competition and the matter coming for your appearance and stands posted to **DT 19-12-2025 on** that day your personal or advocate attend before the Honorable Court at **10:30 am** failing which the Honorable Court is decided under court of law.
N.CHITTIBABU.
ADVOCATE
VISAKHAPATNAM.

కొమ్మాది మైదానంలో టర్ఫ్ సదుపాయం

భీమిలి ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -మధురవాడ : కొమ్మాది క్రీడా ప్రాంగణాన్ని హైదరాబాద్ గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్‌లో మాదిరిగా టర్ఫ్ మైదానంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. తమిళనాడులోని చెన్నై, మధురైలలో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు జరగనున్న హాకీ మెన్స్ జూనియర్ వరల్డ్ కప్ పోటీల ట్రోఫీని జిల్లా పరిషత్ సమీపంలోని అంకోసా భవనంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్ రాజు, సిహెచ్.వంశీకృష్ణశ్రీనివాస్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టర్ఫ్ సౌకర్యంతో దేశీయ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయి హాకీ ఆట తీరు, మెళకువలు నేర్చుకోవచ్చని చెప్పారు. హాకీలో భారతదేశానికి పూర్వ వైభవం తీసుకురావాలని క్రీడాకారులను కోరారు. 1925 నవంబర్ 7న స్థాపించిన ఇండియన్ హాకీ ఫెడరేషన్ వందేళ్లు పూర్తయిన సందర్భంగా క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. జింబాబ్వే, శ్రీలంక వంటి అనేక చిన్న దేశాలకు క్రీడలతోనే ప్రపంచ వ్యాప్త గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో విద్యతో పాటు క్రీడలకు విశేష ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు.

హాకీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజు మాట్లాడుతూ, పొరుగునే ఉన్న ఒడిశాలో 24 టర్ఫ్‌లు, పంజాబ్‌లో 14 టర్ఫ్‌లు ఉండగా ఆంధ్రలో కేవలం 3 టర్ఫ్ మైదానాలు మాత్రమే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ, కడప, పులివెందులలో ఒక్కొక్క టర్ఫ్ మైదానాలు ఉన్నాయని, డిజైన్ లోపం వల్ల కడప టర్ఫ్ మైదానం పూర్తిగా వర్షపు నీటితో మునిగిపోతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హాకీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కె.అప్పారావు, హాకీ క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాకీ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు గంటా, వంశీకృష్ణ, విష్ణుకుమార్‌రాజు

నేరాలు ఘోరాలు

ఎస్‌విఎ హోటల్లో భారీ అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ శ్రీకాంత్‌నగర్‌లో ఉన్న హోటల్ ఎస్‌విఎలో సోమవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. హోటల్ యజమాని పప్పల సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం మధ్యాహ్నం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న రిసెప్షన్ కార్యాలయం వద్ద విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సెల్లార్ ఉన్న ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డు వరకు వ్యాపించడంతో పెద్ద ఎత్తున పొగతో కూడిన మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న హోటల్ సిబ్బంది మంటలు ఆపేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు వచ్చి వెంటనే మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఈ అగ్ని ప్రమాదంతో సుమారుగా రూ.80 లక్షలు నష్టం ఉండవచ్చని హోటల్ యజమాని సత్యనారాయణ తెలిపారు. ఎవరికి ఎటువంటి ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - కశింకోట: శారదానదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. వివరాలివి. మండలంలోని తేగాడ గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలు అంత్యక్రియలకు గ్రామస్తులతో వెళ్లిన నగిరెడ్డి చిన్న రమణ (49) అనే రైతు ఆదివారం శారదా నదిలో స్నానమాచరించేందుకు దిగగా, నదిలో నీటి ప్రవాహం ఉధృతికి గల్లంతయ్యాడు. దీనిపై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా సిఐ స్వామి నాయుడు నేతృత్వంలో గజ ఈతగాళ్ళను తీసుకొచ్చి గాలింపు చర్యలు చేపట్టడంతో సోమవారం మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి పంచనామా నిర్వహించి,. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న రమణ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడు కుమారుడు సాయి గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును ఎస్ ఐ మనోజ్ కుమార్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

రైతులపై 'కూటమి' నిర్లక్ష్యం : వైసిపి

ప్రజాశక్తి- ఆనందపురం: రాష్ట్రంలో అన్నదాతల పట్ల కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బోని అప్పలనాయుడు ఆరోపించారు. తుపానులు, అకాల వర్షాల ప్రభావంతో వరి, మొక్కజొన్న, అరటి తదితర పంటలు భారీగా దెబ్బతిన్నాయని, వేలాది మంది రైతులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం 'రైతు భరోసా'ను నామమాత్రంగానే అమలు చేసి నిరాశ పరిచిందని పేర్కొన్నారు. రూ.లక్షల్లో జరిగిన పంటనష్టానికి ప్రభుత్వం రూ.పదుల్లో మాత్రమే పరిహారం ఇవ్వడం రైతుల ఆర్థిక పరిస్థితిని మరింత దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారంతో పాటు క్రాప్ ఇన్స్యూరెన్స్ సకాలంలో చెల్లిస్తే రైతులకు నిజమైన మద్దతు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు పడుతున్న కష్టాలను గమనించి ప్రభుత్వం తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్ష

ప్రజాశక్తి- ఆనందపురం : యువరాజ్ సింగ్ కేన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దిపాలెం గ్రామంలో సోమవారం కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, బిపి, మధుమేహం పరీక్షలను సుమారు 100 మందికి నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పాడ అప్పారావు మాట్లాడుతూ, పెద్దిపాలెంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి మౌలిక వసతులు, తాగునీరు, కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో రూపాకుల రవికుమార్, మరుపిళ్ల సురేష్ బాబు, డాక్టర్ వైడి.కల్యాణి, పి.రాముడమ్మ పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖలో వార్షిక తనిఖీలు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పశు వైద్యశాలలో సోమవారం పశు వైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ వార్షిక తనిఖీలు నిర్వహించారు. పశువైద్యశాల పరిధిలో పశువులకు వేసిన వ్యాక్సిన్లు, ప్రభుత్వం అమలు చేసిన ఇన్స్యూరెన్స్ తదితరాలను పరిశీలించారు. అనంతరం పద్మనాభం మండలం గంధవరంలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు సమగ్ర సర్వే చేసి భూమి, కోళ్లు మేకలు, గొర్రెలు వంటి వివరాల సేకరణ కమిటీలో పశు సంరక్షణ సహాయకులు ఒకరు ఉంటారని చెప్పారు. ప్రభుత్వం పశువుల దాణాను 50 శాతం రాయితీ రైతులకు అందిస్తున్నామన్నారు. గడ్డి విత్తనాలు, బొబ్బర్లు, కాకిజొన్న, మొక్కజొన్న వంటి పచ్చగడ్డి విత్తనాలను 75 శాతం రాయితీపై అందజేస్తున్నామని తెలిపారు.

ఆదాయపు పన్ను డబ్బులు కార్మికులకు ఇప్పించండి

వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు

ప్రజాశక్తి-మధురవాడ : మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల వద్ద 2016 సంవత్సరం నుండి 2020 వరకు ఆదాయపు పన్ను వసూలు చేశారని, వారికి ఇస్తున్న తక్కువ జీతాలకు ఇది చట్ట విరుద్ధం అని, వసూలు చేసిన ఆదాయపు పన్ను డబ్బులు కార్మికులకు వెనక్కి ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటికే అన్ని జోనల్ కార్యాలయాలు కార్మికులకు ఇచ్చేసాయని, 2వ జోనల్ కార్యాలయం పరిధిలో మాత్రం ఇవ్వలేదని తెలియజేశారు. ఈ మేరకు జోనల్ కార్యాలయం పారిశుధ్య కార్మికులు పిజిఆర్ఎస్‌లో ఎగ్జిక్యూటివ్ శాంతి రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జోన్ గౌరవాధ్యక్షులు డి.అప్పలరాజు మాట్లాడుతూ, ఇప్పటికీ అనేక వినతి పత్రాలు అందజేశమని తెలిపారు. ఎస్ఎల్ఎఫ్ లీడర్ మృతిచెందడంతో ఆలస్యమైందని యుసిడి, ప్రజారోగ్య విధాగం అధికారులు చెపుతున్నారని పేర్కొన్నారు. మిగతా జోన్లుకార్మికులకు ఇచ్చి రెండేళ్లుపైన కావస్తుందని తెలిపారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి వెంటనే ఆదాయపు పన్ను డబ్బులు కార్మికులకు ఇప్పించాలని కోరారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు డి.సూరిబాబు, సిహెచ్.శేషుబాబు, కె.నాగరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డయాబెటిక్ రెటినోపతిపై నిర్లక్ష్యం వద్దు

డాక్టర్ విశాల్ సంజయ్ జాదవ్

ప్రజాశక్తి - ఆరిలోవ : మధుమేహ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోకుండా అశ్రద్ధ చేస్తే డయాబెటిక్ రెటినోపతి కారణంగా కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యులు విశాల్ సంజయ్ జాదవ్ తెలిపారు. మధుమేహ వ్యాధి నేత్ర సమస్యలను పెంచుతుందని, ముఖ్యంగా డయాబెటిక్ రెటినోపతికి గురువుతారని పేర్కొన్నారు. టైప్ 1 డయాబెటిస్ ఉన్న రోగులకు డయాబెటిస్ నిర్ధారణ అయిన ఐదేళ్ల తరువాత సమగ్ర కంటి పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. టైప్ 2 ఉన్నవారు వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే సమగ్ర కంటి పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. డయాబెటిక్ రెటినోపతి అనేది ముందస్తు లక్షణాలు లేకుండా నిశ్శబ్దంగా పెరుగుతుందని, మధుమేహం ఉన్నవారు దృష్టిని కోల్పోకుండా ఉండేందుకు రెటీనాలో వచ్చే మార్పులను గమనించుటకు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించుట, రక్తపోటు నియంత్రలో ఉంచుకోవడం, పొగాకు ఉత్పత్తులు వాడకం మానివేయడం, క్రమం తప్పకుండా వ్యాయామం ద్వారా డయాబెటిక్ రెటినోపతిని నియంత్రించకోవచ్చని తెలిపారు. డయాబెటిక్ రెటినోపతి వ్యాధికి ఇంట్రావిట్రీయాల్ ఇంజక్షన్లు, లేజర్ ఫొటోకోగ్యులేషన్ ద్వారా, అవసరమైతే శస్త్ర చికిత్సలు అందంచవచ్చని వివరించారు.

27 నుంచి గీతంలో బిజినెస్ ఇన్నోవేషన్ సదస్సు

ప్రజాశక్తి-మధురవాడ : సుస్థిర సమాజ అభివృద్ధికి సరికొత్త వాణిజ్య నమూనాలు అనే అంశంపై ఈ నెల 27, 28 తేదీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ రాజా పి.పప్పు తెలిపారు. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి 150 మందికి పైగా పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, ప్రణాళికా నిపుణులు, వాణిజ్య నిపుణులు ఈ సదస్సుకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఆర్థిక రంగంలో వస్తున్న మార్పులు, వాటి ప్రభావంతో రూపు దిద్దుకుంటున్న వాణిజ్య నమునాలపై ప్రముఖుల ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో వాణిజ్యరంగంపై పర్యావరణ మార్పుల ప్రభావం, డిజిటల్ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానంపై సదస్సులో చర్చిస్తామని పేర్కొన్నారు. అమెరికా, చైనా, యుకె, కెనడా తదితర దేశాల నుంచి విద్యా రంగ నిపుణులు సదస్సులో పాల్గొనున్నారని వెల్లడించారు.

బాందేవుపురం పిఎసిఎస్ చైర్మన్‌కు అభినందనలు

ప్రజాశక్తి-పద్మనాభం

మండలంలోని భాందేవపురం పిఎసిఎస్ చైర్మన్‌గా నియమితులైన సాగి కృష్ణమూర్తి రాజును స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం తన నివాసంలో అభినందించారు. ఆయన వెంట జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, కె.నగేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ పరికరాల నిర్వహణకు వినతి

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డు పరిధి జమ్మి చెరువు పబ్లిక్ పార్క్ ఆధునీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వ్యాయామ పరికరాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుకు అతని కార్యాలయంలో సోమవారం వాకర్స్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. లోపలకు పశువులు రాకుండా పార్కు ప్రవేశం వద్ద పటిష్టమైన గేట్ ఏర్పాటు చేయాలని కోరారు. స్నాన ఘట్టానికి అంతరాయం లేకుండా బుద్ధుని విగ్రహాన్ని మారిస్తే ఉపయోగంగా ఉంటుందని సూచించారు. పార్కు వద్ద పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో వాకర్స్ సభ్యులు శంకర్‌కుమార్, ఎస్.జోగారావు, టి.అప్పారావు, వై.వెంకటరావు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు శ్రేష్ట ఎంపిక

ప్రజాశక్తి- భీమునిపట్నం: మచిలీపట్నం పోలీస్ గ్రౌండ్స్‌లో ఈ నెల 25 నుంచి 27 వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగు రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని వై ప్రార్థనాశ్రేష్ట ఎంపికైనట్లు సన్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా బాలికను పాఠశాలలో అభినందించారు. గత నెల 29వ తేదీన అనకాపల్లి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా 14 ఏళ్ల లోపు బాలబాలికలకు నిర్వహించిన బాడ్మింటన్ పోటీల్లో విద్యార్థిని శ్రేష్ట ఎంపికైనట్లు తెలిపారు.

సన్ స్కూల్ డైరెక్టర్‌తో విద్యార్థిని శ్రేష్ట

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడి ఫైర్‌స్టేషన్ సమీపంలో "స్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ 2024-25" పథకం కింద గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ నిధులు రూ.30.38 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణానికి మేయర్ పీలా శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జివిఎంసి కేతన్ గార్గ్, పలువురు కార్పొరేటర్లతో కలిసి విశాఖ ఎంపీ శ్రీభరత్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతి, భద్రత, రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి గాజువాకలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి అనుమతులను మంజూరు చేశాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ నగరంలో మూడు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి రూ.172 కోట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేశాయని తెలిపారు. వాటిలో ముందుగా గాజువాక వడ్లపూడి ఫైర్ స్టేషన్ ప్రాంతంలో నాలుగు అంతస్తులతో నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. మహిళలు ఎంతో దూరం నుండి ఉద్యోగాలకు వెళ్తున్నారని, వారి అభ్యున్నతికి, రక్షణ, భద్రత దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమెన్ హాస్టల్స్ నిర్మాణం చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ నిధులను తీసుకొచ్చారని తెలిపారు. విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ, వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించాలని కమిషనర్‌ను కోరారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఈ హాస్టల్ చాలా సౌకర్యంగా, భద్రతతో ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి మహిళలకు పెద్దపీట వేస్తూ వారి పేరు మీదుగా హౌసింగ్, పట్టాల మంజూరు, ఫ్రీ బస్సు లాంటి ఎన్నో ప్రయోజనాలను అందిస్తున్నారని తెలిపారు. జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ, మహిళలకు అన్ని మౌలిక సదుపాయాలతో హాస్టల్ నిర్మాణం సౌకర్యవంతంగా 18 నెలలలో పూర్తి చేసి అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొండా జగన్, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, లేళ్ల కోటేశ్వరరావు, కాకి గోవింద రెడ్డి, మొల్లి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ తదితరులు

హల్దీ కుంకుమ్ పుస్తకావిష్కరణలో పాల్గొన్న అతిథులు

హల్దీ కుంకుమ్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు స్మారక సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన పెన్మత్స లలితావాశిష్ట 2006లో తెలుగులో రచించిన ఊయల కథా సంపుటికి రేగులగెడ్డ వెంకటలక్ష్మి గాయత్రి హిందీలోకి అనువదించిన హల్దీ కుంకుమ్ పుస్తకాన్ని సోమవారం పౌర గ్రంథాలయంలో ప్రముఖులు ఆవిష్కరించారు. సభాధ్యక్షులు పెన్మత్స లలితావాశిష్ట మాట్లాడుతూ, ఊయల కవితా సంపుటి హిందీలో హల్దీ కుంకుమ్‌గా రావడానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. వీసపాటి గిరిజ రాజ్యలక్ష్మి సమాఖ్య నివేదికను చదివి వినిపించారు. ముఖ్య అతిథి సెంచూరియన్ విశ్వవిద్యాలయం విసి జిఎస్ఎన్.రాజు హాజరై మాట్లాడుతూ తెలుగు, హిందీ రచయిత్రులు ఇద్దరినీ అభినందించారు. లలితా వాశిష్ట తండ్రి అచ్యుత రామరాజు ఆశయాలను కొనసాగిస్తున్నందుకు ప్రశంసించారు. విశిష్ట అతిథి, నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్ దాస్ మాట్లాడుతూ, పసుపు కుంకుమ పవిత్రతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డివి.సూర్యారావు, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ దేవులపల్లి పద్మజ, చిరంజీవిరావు, రేగులగడ్డ వెంకటలక్ష్మిగాయత్రి, అక్కినపల్లి భాగ్యలక్ష్మి, పెన్మత్స లక్ష్మీ నరసింహారాజు, పెన్మత్స జగన్నాథ రాజు, డాక్టర్ కెవిఎస్.మూర్తి, భాగవతుల సత్యనారాయణమూర్తి, లలిత తదితరులు పాల్గొన్నారు.

కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్

ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి -గాజువాక : ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ కోరారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) గాజువాక మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని అక్కిరెడ్డిపాలెం, మింది, గాజువాక, కణితి, అగనంపూడి, యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పోరాడాలన్నారు. ఐదేళ్ల పైబడి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులంతా టెట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాల్సిందేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారని తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 2010కి ముందు ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 9న భీమిలి డివిజన్‌లో, 10వ తేదీన పెందుర్తి డివిజన్‌లో భారీ నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికలలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఐఆర్ 29 శాతం తక్షణం ప్రకటించాలని, 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎ.విజయకుమారి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇమంది ప్రసాద్, సబ్బారావు నూకరాజు, నాయకులు కె.మురళీకృష్ణ, ఎమ్‌డి అబ్దుల్‌హక్, నిడదవోలు శ్రీనివాస్ రాజు, బి.సుగుణ, ఎస్‌వి.శ్రీనివాస్, ఎస్.నిరుపమ, ప్రసూనాంబ, బి.సువర్ణ, కృష్ణవేణి పాల్గొన్నారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -గాజువాక : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి 72వ వార్డు పరిధి పాత గాజువాక చైతన్య నగర్‌లో వైసిపి ప్రచార కమిటీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు జీలకర్ర నాగేంద్ర ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, గాజువాక నియోజకవర్గం పరిశీలకులు తైనాల విజయకుమార్, నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పల్లా చిన్నతల్లి, మంత్రి శంకర్ నారాయణ, బొడ్డ గోవింద్, గొందేసి శ్రీనివాసరెడ్డి, గొందేసి వెంకటరమణరెడ్డి, కర్రి ప్రసాద్, పరిధల శ్రీనివాస, అమ్మిరాజు, దాడి సంతోష్, ఫణి దీప్తి, చక్రి, ఇప్పిలి గణేష్, ముగిడి కృష్ణ, వాడపల్లి వెంకట్, కిలారి హర్ష, పైలా వంశీ పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ శివప్రసాదరావు

పిజిఆర్ఎస్‌కు వినతులు

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : జివిఎంసి జోన్ 3 కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు ఐదు వినతులు అందినట్లు జోనల్ కమిషనర్ శివప్రసాదరావు తెలిపారు. అనంతరం పరిశీలించి ఫిర్యాదుదారులకు న్యాయం జరిగే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు జోనల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 3 అర్జీలు అందినట్లు జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 1, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 2 అర్జీలు అందాయి. వీటిని తదుపరి చర్యల నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు ఆయన తెలిపారు.

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆర్‌డిఒ సంగీత్ మాథుర్‌కు వివిధ సమస్యలపై 6 అర్జీలు అందాయి. టిని తదుపరి చర్యల నిమిత్తం తహశీల్దార్‌కు పంపించినట్లు ఆర్‌డిఒ తెలిపారు.

శ్రీకుమార్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి- కరాస: ఎఐటియుసి సమావేశానికి విశాఖకు చేరుకున్న ఎఐడిఇఎఫ్ జాతీయ నాయకుడు సి.శ్రీకుమార్‌కు ఐఎన్‌సి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సబ్బం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు విశాఖ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. అనంతరం ఎన్ఎస్‌టిఎల్‌లో ఈస్టర్న్ నేవల్ కమాండ్ పరిధిలో ఉన్న వివిధ రక్షణ సంస్థలు డాక్ యార్డ్, ఎన్ఎడి, ఎంఒలలో కార్మికుల ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌సి. ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉడత అప్పలరాజు, సుధాకర్, బన్నయ్, చరణ్, ఎల్లాజీ, మన్యాల ప్రసాద్ బాబు, అచ్యుతరావు, బూసి వెంకటరావు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఆనందపురం : ముచ్చర్ల గ్రామ అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.8 లక్షలు ఎంపిపి నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆనందపురం వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ ప్రజల రహదారి సమస్యలు తొలగించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులు దశలవారీగా సాగుతాయని, ప్రజలకు అవసరమైన సౌకర్యాలందించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని వెంకటరావు వెల్లడించారు. పాత రహదారి స్థానంలో సిసి రోడ్డు నిర్మాణం గ్రామానికి ఎంతో ఉపయుక్తమవుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో శనగం ఎర్రయ్య, లంక అప్పలనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 75వ వార్డు పరిధిలో సుమారు రూ.65 లక్షల జివిఎంసి నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయితో కలిసి మేయర్ పీలా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గాజువాకను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యేతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. 75వ వార్డులో ఎన్‌టిఆర్ విగ్రహం నుండి నడుపూరు వరకు నూతనంగా తాగు నీటి సరఫరా కొరకు 160 ఎంఎం డయా కలిగిన హెచ్‌పి పైప్‌లైన్‌కు, పెదగంట్యాడలో సుమారు రూ.49.45 లక్షల వ్యయంతో మూడు శ్మశాన వాటిక ప్లాట్‌ఫాం, శ్మశాన వాటిక గ్రౌండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పరిచేందుకు ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. గాజువాక ప్రాంతాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రతి వార్డులోనూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్లు, వార్డు సచివాలయ కార్యదర్శులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అయ్యప్ప పీఠంలో అన్నదానం

ప్రజాశక్తి- తగరపువలస : శ్రీ దుర్గాలమ్మ అయ్యప్ప స్వామి సేవా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అయ్యప్ప, భవాని, శివ భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా సోమవారం టిడిపి సీనియర్ నాయకులు గరే చంద్రమౌళి కుమారుడు గరే సదానంద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ మృతికి జెడ్‌సిదే బాధ్యత

- సచివాలయ, సిపిఎస్ ఉద్యోగుల కొవ్వొత్తుల ర్యాలీ
- వెంటనే అరెస్ట్ చేయాలని నిరసన, మానవహారం

ప్రజాశక్తి -అనకాపల్లి : అధికారుల తీవ్ర మానసిక ఒత్తిడితో అనకాపల్లిలోని జివిఎంసి సచివాలయం-9లో వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న ఎం నూకరాజు (38) ఈనెల 20న మృతి చెందాడని సచివాలయం, సిపిఎస్ ఉద్యోగులు, నాయకులు, సిఐటియు నాయకులు కార్యకర్తలు ఆరోపించారు. దీనికి జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై అధికారులు వేధింపులు ఆపాలని, జెడ్‌సిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి నూకరాజు మృతికి సంతాపంగా అనకాపల్లి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. జోనల్ కమిషనర్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం మీదుగా నెహ్రూ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం నిర్వహించారు. సిపిఎస్ ఉద్యోగుల నాయకులు మాట్లాడుతూ అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి సెలవు ఇవ్వకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడితో నూకరాజు మృతి చెందారని, జెడ్‌సిని వెంటనే అరెస్టు చేయాలని, ప్రభుత్వానికి సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ నూకరాజు మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూకరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎం ఉమామహేశ్వరరావు, సిపిఎస్ ఉద్యోగులు నాయకులు సతీష్, రవి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్ ,బి ఉమా మహేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు, కే తాతయ్య బాబు, నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని ధర్నా

నినాదాలు చేస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని టిడ్కో, జేఎన్‌ఆర్ కాలనీలో 15ఏళ్లుగా నివసిస్తున్న పేద కుటుంబాలకు ఇల్లు, ఇంటిస్థలాలపై హక్కు కల్పించాలని ఐద్వా నేతలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఐద్వా జిల్లా అధ్యక్షులు పి. మాణిక్యం, జిల్లా జాయింట్ సెక్రటరీ అన్నపూర్ణ నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 3 సెంట్లు ఇంటిస్థలం, ఇళ్లు నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేయాలన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌కు ఇళ్లు, ఇంటిస్థలాల మంజూరు చేయాలని దరఖాస్తులు సమర్పించారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఈనెల30 వరకు దరఖాస్తుకు గడువు ఉందని, అర్హులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీత, సీతమ్మ, కే. లక్ష్మి, బేగం, మున్ని, రాధ, వెంకటలక్ష్మి, రాము, ప్రకాశ్, సాయి వెంకటి, రాజకుమారి, ఉష, అలేఖ్య, లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో వివక్ష

- అధికారుల తీరుపై గండి బాబ్జి ధ్వజం

ప్రజాశక్తి- సబ్బవరం : ప్రజా సమస్యల పరిష్కార విషయంలో అధికారుల పక్షపాత వైఖరి తగదని పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జి అన్నారు. సోమవారం పిజిఆర్ఎస్‌లో పాల్గొని స్థానిక తహశీల్దార్ చిన్నికృష్ణ, ఎంపిడిఒ పి. పద్మజ, సి ఐ జి. రామచంద్రరావు, వలువురు అధికారులతో సమస్యలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినప్పటికీ మండలంలోని తమ పార్టీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించడం లేదని, వారు కోరిన పనులు చేపట్టనట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీంతో పిజిఆర్ఎస్‌కు వచ్చి ప్రశ్నించాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు పనితీరు మార్చుకోవాలని, ప్రజల కోసం పనిచేయాలన్నారు.కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, నేతలు కె రామకృష్ణంరాజు, దాడి కన్నం నాయుడు ఆడారి నాగరాజు, పల్లా తాతారావు,గొర్లె చైతన్య, బలిరెడ్డి అప్పారావు,బొండా రాజు, ఎల్లాజీ, పోతల శ్రీనివాసరావు, రొంగలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ఇరువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 142/2 లో ఆక్రమణకు గురైన 3.52 ఎకరాల కొండ పోరంబోకు భూమిని ప్రభుత్వం స్వాధీనం తీసుకోవాలని మండల తెలుగు యువత అధ్యక్షులు బలిరెడ్డి అప్పారావు కోరారు. సోమవారం పిజిఆర్ఎస్‌లో స్థానిక తహశీల్దారు బి. చిన్నికృష్ణకు ఫిర్యాదు చేశారు. పెందుర్తి టీడీపీ ఇంచార్జి గండి బాబ్జి సమక్షంలో అందించిన ఫిర్యాదులో ఈ భూమిని 2013లో కొంతమంది తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి తహశీల్దార్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అక్రమాలకు పాల్పడిన ఆనాటి డిప్యూటీ తహశీల్దార్, సర్వేయర్లను ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. దీంతో ఆక్రమణదారులు కోర్టును ఆశ్రయిస్తే, ఇటీవల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని కాపాడాలని కోర్టు తీర్పునిచ్చినట్లు స్పష్టం చేశారు. అయినప్పటికీ అధికారులు ఆ భూమిని ఇంతవరకు ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. తక్షణమే ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని. ప్రజావసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మంగవరంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు

ప్రజాశక్తి - పాయకరావుపేట : మండలంలోని మంగవరం గ్రామంలో శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ పాయకరావుపేట స్పెసెస్ డిగ్రీ కాలేజి ఎన్ఎస్ఎస్. యూనిట ప్రత్యేక శిబిరం నిర్వహించారు. స్పెషల్ క్యాంపును గ్రామ సర్పంచ్ వంగలపూడి రామారావు ప్రారంభించారు. ఏడు రోజుల పాటుకళాశాలకు చెందిన యాభై మంది ఎన్ఎస్ఎస్. వాలంటీర్లు గ్రామంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారని ఎన్ఎస్ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ జీ తాతయ్యనాయుడు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల న్యాక్ ఐక్యూఏసీ ఇంచార్జ్ డాక్టర్ అరుణ కుమార్ త్రిపాఠి, ఎంపిటిసి గోవిందు, పంచాయతీ కార్యదర్శి చిట్టూరి కొండలరావు, గ్రామస్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు అర్జీల వెల్లువ

పిజిఆర్ఎస్‌లో సమస్యలు వింటున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి- అనకాపల్లి : అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్‌లో డిఆర్ఒ వై.సత్యనారాయణ రావుతో కలిసి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని, రీఓపెన్ కాకుండా చూడాలని ఆదేశించారు. అర్జీదారులు తమ సమస్యలపై 1100కి కాల్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చునిసూచించారు. కలెక్టరేట్ పిజిఆర్ఎస్‌లో 295 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో సిపిఒ జి.రామారావు, డ్వామా, డిఆర్డిఎ, మెప్మా, గృహనిర్మాణశాఖ పీడీలుపూర్ణిమ దేవి, శచీ దేవి, కె సరోజినీ, శ్రీనివాస్, డిఇఒ జి.అప్పారావునాయుడు, డిఎంహెచ్ఒ హైమవతి, ఎక్సయిజ్, రవాణా శాఖ జిల్లాఅధికారులు వి సుధీర్, జి మనోహర్, జిల్లా సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్‌రాజా, జిల్లా స్టాంపులు,రిజిస్ట్రేషన్ అధికారి మన్మధరావు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 60 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఎస్‌పి తుహిన్ సిన్హా పాల్గొని, 60 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్‌పి తుహిన్ సిన్హా ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి, వాస్తవాలు నిర్ధారించగానే వారం రోజుల్లో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చర్యా నివేదికను జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి -అనకాపల్లి : జివిఎంసి ప్రధాన ఉన్నత పాఠశాల 1975 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ కలయిక వేడుకలనువచ్చేనెల 6,7 తేదీల్లో నిర్వహించనున్న సందర్భంగా సోమవారం అనకాపల్లిలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల 8,9,10 విద్యార్థులకు పెద్ద హైస్కూల్‌లో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వాతావరణ కాలుష్యం, బాలిక సంరక్షణ అంశాలపై పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జివిఎంసి హై స్కూల్ హెచ్ఎం బ్రహ్మాజీ, పిఇటి ఎస్వీ నరసింహం , రమాకాంత్, డ్రాయింగ్ టీచర్ బొడ్డేడ సూర్యనారాయణ, గోల్డెన్ జూబ్లీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, కార్యదర్శి మళ్ల లోకేష్, కోశాధికారి రాపేటి నారాయణరావు, ఆడారి నారాయణ మూర్తి, బొగ్గారపు మంగరాజు, కొనతాల రాము పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. విజేతలకు వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు.

సమన్వయంతో నేర నియంత్రణకు చర్యలు

నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో మహిళలు, బాలలు, వృద్ధుల భద్రతకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆదేశించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల్లో మహిళల అదృశ్యంపై వివరాలను సేకరించి, అవసరమైనప్పుడు పోలీసులకు తెలియజేయాలన్నారు. మిస్సింగ్ కేసుల కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్, మొబైల్ ధ్రువీకరణ వంటి అంశాలను ఆన్‌లైన్‌లో వెరిఫై చేయాలన్నారు.బాల్య వివాహాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని, ఎన్‌డిపిఎస్ నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాలు, గంజాయి, అక్రమ రవాణా, అనుమానాస్పద వ్యక్తులపై స్థానిక పోలీసులకు సమాచారం తక్షణమే అందించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగాఉండాలన్నారు. దీనిపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రతిభ కనబరిచిన గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు అభినందన

జిల్లాలో అత్యుత్తమ సేవలు అందించిన గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు కె.ఉమా (అనకాపల్లి టౌన్), పి.నయోమి (కశింకోట), పి.వీరలక్ష్మి (ఎలమంచిలి రూరల్), ఎం.అరుణ (పరవాడ), ఈ.రాజేశ్వరి (మాకవర పాలెం), పి.లలిత (నాతవరం)లకు జిల్లా ఎస్‌పి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేసి అభినందించారు.సమన్వయంతో పనిచేసి నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ బాలసూర్యారావు పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్ అమలు చేయాలి

మాట్లాడుతున్న సంఘం మండల అధ్యక్షులు చిన్నారావు

ప్రజాశక్తి -అనకాపల్లి :తమకు హెల్త్ అలవెన్స్ తక్షణమే అమలు చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్, యూనియన్ (సిఐటియు) అనకాపల్లి కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో సమావేశంలో సంఘం మండల అధ్యక్షులు పలివెల చిన్నారావు మాట్లాడుతూ జూన్ నెలలో గ్రీన్ అంబాసిడర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నెలకు రూ.నాలుగు వేలు హెల్త్ అలవెన్స్ నిధులు లేవనే సాకులతో కొన్ని పంచాయతీల్లో అమలు చేయడం లేదన్నారు. తక్షణమే హెల్త్ అలవెన్స్ అమలు చేయకుంటే కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ములకలపల్లి అప్పలరాజు, కార్యవర్గ సభ్యులు అప్పారావు, రావాడ కనకమాలక్ష్మి, ఎన్.అప్పారావు, యల్లబెల్లి బాబూజీ, ఎల్లబెల్లి అప్పారావు, జె. విజయ్, పాల్గొన్నారు.

సమస్యలపై విఆర్ఎల నిరసన

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విఆర్ఎలు

ప్రజాశక్తి- అనకాపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విఆర్ఎల జిల్లా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఆర్‌డిఒ షేక్ ఆయిషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా తమకు వేతనాలు పెంచలేదని, ఇస్తున్న డిఎను నిలుపుదల చేశారని, సంబంధం లేని పనులను అప్పగిస్తూ అదనపు భారం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో మాదిరిగా ప్రమోషన్లు ఇచ్చి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సంఘం నాయకులు గంగాధర్, శాంతి, శీను, లోవరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - యలమంచిలి : ఉన్నత పాఠశాల విద్యార్థులు కొందరు మత్తు పదార్థాలకు అలవాటు పడడం కలవరానికి గురిచేస్తోందని పట్టణ ఎస్ఐ. సావిత్రి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కొత్తపేట జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హెచ్.ఎం. వై.వి.రమణ మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలగాల్సిన విద్యార్థులు కొందరు చెడు మార్గాలు అలవర్చుకోవడం బాధాకరమన్నారు. విద్యార్థి దశలోనే చెడు అలవాట్లకు వారి కుటుంబ భవిష్యత్తు కూడా విషాదంలో మునిగిపోతుంద న్నారు.కార్యక్రమంలో ఎఎస్ఐ. చల్లారావు, మహిళా పోలీసు వరలక్ష్మి, పాఠశాల పిడి కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సేవా దృక్పథంతో పనిచేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : వైద్య సిబ్బంది సేవా దృక్పథంతో పనిచేసి, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిపిఎంఒ. డాక్టర్ ప్రశాంతి అన్నారు, సోమవారం మండలంలో పలు హెల్త్ క్లినిక్ సెంటర్లను సందర్శించారు, రికార్డులు తనిఖీ చేయడంతో పాటు సిబ్బందికి పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు, సమయపాలన పాటించి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు, కార్యక్రమంలో ఎస్ఒ. రామచంద్ర, డిపిఒ జగదీష్, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ మౌనిక, ఎంపిహెచ్ఒ బుల్లిబాబు హెచ్‌విజయమ్మ పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత

ప్రజాశక్తి - కశింకోట : మండలంలని ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన కరణం ఈశ్వరరావు జనసేన క్రియాశీలక సభ్యునిగా ఉంటూ మృతిచెందాడు, మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఆయన కుటుంబానికి జనసేన బీమా పరిహారం కింద రూ.ఐదు లక్షల చెక్కును ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అందజేశారు కార్యక్రమంలో జనసేన గ్రామఅధ్యక్షులు ఉపాధ్యక్షులు కరణం వెంకటరమణ పిల్లి సతీష్ పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి సాయం అందజేతపై అధినేత పవన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, నియోజకవర్గ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీకి ధన్యవాదాలు తెలిపారు

స్థానిక ఎన్నికల్లో యాదవులు సత్తా చాటాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవ సంఘం సత్తా చూపించాలని జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు భరణికాన బాబూరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాడుగుల నియోజకవర్గస్థాయి యాదవ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభాపరంగా అధికశాతం ఉన్న యాదవ గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసిలుగా గెలిపించాలన్నారు. జిల్లాలో యాదవ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించాలన్నారు అనంతరం కె.కోటపాడు దేవరాపల్లి చీడికాడ మాడుగుల మండలాల కార్యవర్గాలను, నియోజకవర్గ కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి సబ్బి శ్రీనివాసరావు, భరణికాన నరసింహమూర్తి, కరక సోమ నాయుడు, పంచదార్ల సూరిబాబు, గజ్జి గంగాధర్, చల్ల నానాజీ, ఎలమంచిలి ధర్మారావు, నంబారు అప్పారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఐక్యతా ర్యాలీ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ ఏకత, దేశభక్తి, పౌర బాధ్యత భావనలను అలవర్చుకోవాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ (నెహ్రూ యువ కేంద్రం) ఆధ్వర్యంలో సోమవారం అచ్యుతాపురంలో సర్దార్ వల్లభాయి పటేల్ జయంతోత్సవాలను పురస్కరించుకుని యూనిటీ మార్చ్‌ను ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏక్ భారత్, ఆత్మనిర్భర్ భారత్" లక్ష్యాలను సాధించేందుకు యువతలో ఐక్యత, దేశభక్తి, పౌర బాధ్యతను పెంపొందించడానికి ర్యాలీ దోహదపడుతుందన్నారు. దేశ నిర్మాణంలో ప్రతి భారతీయుడూ భాగస్వామ్యం కావాలన్నారు. . మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు, ఏఎస్పీ ఎల్. మోహన్ రావు, ప్రశాంతి విద్యా సంస్థల అధినేత ధరిమిరెడ్డి ప్రసాదరావు, ప్రిన్సిపాల్ కొణతాల శ్రీనివాసరావు, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకట రమణ, నైన్ మ్యాన్ పవర్ సొల్యూషన్స్ సంస్థ సీఈవో పిళ్లా రమేష్‌బాబు, నాగనబోయిన నాగేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు,రెడ్డి లీలాప్రసాద్, కాండ్రపు నాయుడు, పిఏసీఎస్ చైర్మన్ గొంతిన భక్త సాయిరాం, కారే రాముడు, ఇందిరాగాంధీ, ప్రశాంతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు ధర్మిరెడ్డి ప్రసాద్, పెద్ద సంఖ్యలో ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా భరతమాత, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. యూనిటీ మార్చ్, ఆత్మ నిర్భర భారత్ ప్రతిజ్ఞలు చేయించారు

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత

• ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి • రైవాడ రిజర్వాయర్‌లో చేప పిల్లల విడుదల

రైవాడ రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మత్స్య సంపదను పెంపొందించే లక్ష్యంతో మండలంలోని రైవాడ జలాశయంలో 4.28 లక్షల చేప పిల్లలను సోమవారం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మత్స్య శాఖ అధికారులతో కలిసి జలాశయంలోకి వదిలారు.ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ, రైవాడ జలాశయంలోని చేపలు 'ఆర్గానిక్ ఫిష్'గా గుర్తింపు పొందాయని, వీటిని కొనుగోలు చేయడానికి, తినడానికి జిల్లావాసులు అమితాసక్తి కనబరుస్తారన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మత్స్యకారులకు మొబైల్ వాన్స్, మోపెడ్స్, ఐస్ బాక్స్‌లు వంటి పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నామన్నారు.. పిల్ల దశలో చేపలను వేటాడకుండా జలాశయ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఐదు నెలల తర్వాతే వేట జరపాలని, వేటదారులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలన్నారు. వేటకు వెళ్లే మత్స్యకారుల రక్షణకు లైఫ్ జాకెట్లను మంజూరు చేయించేలా అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. షెడ్ ఏర్పాటు చేయాలని వేటదారులు ఎమ్మెల్యేను కోరగా, మత్స్య శాఖ ద్వారా ఇరిగేషన్ ఎస్ఇకి లేఖ రాయాలని ఎమ్మెల్యే సూచించారు. మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు లక్ష్మణరావు మాట్లాడుతూ.. రైవాడ జలాశయంపై 250 మందికి పైగా వేటదారులు ఆధారపడి ఉన్నారని, అయితే చాలా మందికి లైసెన్సులు లేవని అన్నారు. రూ. 150 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారిణి విజయ, ఎఫ్‌డిఒ నాగమణి, ఇరిగేషన్ డిఇఇ సత్యం నాయుడు, సిఐ పైడపునాయుడు, జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, దొగ్గ దేముడు నాయుడు, సర్పంచ్ చల్లా లక్ష్మీ నాయుడు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు చల్లా నానాజీ, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, నీటి సంఘం చైర్మన్ గుల్లపల్లి మురళీకృష్ణ, ఎంపిడిఒ ఎంవీ సువర్ణ రాజు, ఎస్ఐ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

చేప పిల్లల లెక్కల్లో తేడాపై ఆందోళన

రైవాడ సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

రైవాడ జలాశయంలో కేవలం 25వేలు చేప పిల్లలను మాత్రమే వదిలిన అధికారులు, అటు ఎమ్మెల్యే బండారు, ఇటు మత్స్యకారులను తప్పుదోవ పట్టించి, తప్పుడు లెక్కలతో మోసం చేస్తున్నారని ఆరోపిస్తున్నా రైవాడ సచివాలయం ఎదుట నేలపై బైఠాయించి మత్స్యకారులు ఆందోళన చేశారు. ఒకే వ్యాన్‌లో చేపపిల్లలను తేవడంపై అనుమానం వచ్చి లెక్కలు వేయగా, అధికారులు చెప్పిన దానికి, వాస్తవంగా రిజర్వాయర్‌లో వదిలిన చేప పిల్లలకు సరిపోవడం లేదని నినదించారు. దీనిపై ఎఫ్‌డిఒ నాగమణి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సుమారు గంటకుపైగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టిన తర్వాత ఎఫ్‌డిఒ నాగమణి బయటకు వచ్చారు. తొలుత పొంతన లేని సమాధానాలతో సర్ది చెప్పాలని చూసినా మత్స్యకారులు నిలదీయడంతో చివరకు వాస్తవాన్ని అంగీకరించారు. ఇపుడు 50 వేలు పిల్లలను మాత్రమే రిజర్వాయర్‌లో వేశామని, మిగతావి రెండు మూడు రోజుల్లో వేస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మొక్కుబడిగా మండల సమావేశం

మాట్లాడుతున్న ఎంపిపి గోవిందరావు

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోదెపు గోవిందరావు ఆధ్వర్యంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఇద్దరు ఎంపిటిసిలు మాత్రమే పాల్గొనగా, మిగిలిన కూటమి సభ్యులు హాజరుకాలేదు.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, తాను ఎంపిపిగా నాలుగేళ్లపాటు అందరు అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లను సమన్వయం చేసుకుని మండల అభివృద్ధికి కృషి చేశానన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత తమ పార్టీలోకి కొందరు ఎంపిటిసిలే స్వార్థంతో అవిశ్వాసం పెట్టారనారు. తనకు పదవులు ముఖ్యం కాదని, మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు పలుసమస్యలపై అధికారులను ప్రశ్నించగా, వారి సమాధానంతో మొక్కుబడిగా సాగింది. ఎటువంటి తీర్మానాలు లేకుండా సభను ముగించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కొండలరావు మాట్లాడుతూ, గత సమావేశం పెట్టిన తర్వాత ప్రస్తుత సమావేశానికి మధ్య 90రోజుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో అత్యవసర సమావేశాన్ని పెట్టామన్నారు. ఎంపిపిపై అవిశ్వాసానికి సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు రానందున, జెడిపి సిఇఒ ఆదేశాల మేరకు ప్రస్తుత ఎంపిపి గోవిందరావు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించామన్నారు. జెడ్‌పిటిసి సేనాపతి సంధ్యారాణి, ఎంపిటిసి పూటకూటి రామ గణేష్, కోఆప్షన్ సభ్యుడు సిద్దా సుకేశ్వరావు, వివిధ గ్రామాలసర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు లాస్య

ప్రజాశక్తి-సబ్బవరం :రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడా పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని కూండ్రపు లాస్య ఎంపికైనట్లు హెచ్ఎం ఎస్. తిరుపతిరావు తెలిపారు.లాస్యను హెచ్ఎం ఎస్.తిరుపతిరావు, ఎంఇఒలు ఎస్. లక్ష్మణరావు, ఎంజె రవీంద్ర బాబు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం ఆర్.ప్రసాద్, పాఠశాల కమిటీ చైర్మన్ శంకర్రావు, వైస్ చైర్మన్ జ్యోతిశ్రీ, పిఇటి అబ్దుల్ రెహమాన్, రత్నాలమ్మ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

ప్రజాశక్తి -సబ్బవరం : మండలంలోని రావులమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు అంతకాపల్లి పంచాయతీ, ఒమ్మివానిపాలెం దరి ఉన్న మాజీ ఎమ్మెల్యే ఆదిప్‌రాజ్ నేచర్ రిసార్ట్ లో సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. తాము చదివిన రోజులలో చేసిన అల్లర్లు, తీపిజ్ఞాపకాలను నెమరువేసుకుని సంతోషంతో గడిపారు.కార్యక్రమంలో గొంప సూర్యనారాయణ, బొకం వెంకటేశ్వర్లు, లెక్కల వెంకటరావు, గండి కనక లక్ష్మి, భారతి, మంగమ్మ పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

• విజయరామరాజు పేట అండర్‌వే బ్రిడ్జి గడ్డర్స్ ధ్వంసంపై పలువురి ధ్వజం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి చోడవరం రోడ్డులో అండర్ బ్రిడ్జి వద్ద భారీ క్వారీ లారీ బీభత్సం సృష్టించింది. రైల్వే సేఫ్టీ గడ్డర్లు నాలుగింటిని ధ్వంసం చేసింది. లారీ నుంచి బండ రాయి రోడ్డుపై పడింది. దీన్ని సిపిఎం, ఆప్ నేతలు సోమవారం ఉదయం పరిశీలించారు. సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, కాళ్ళ తేలయ్యబాబు, ఆప్‌నేత నాయకులు కొణతాల హరినాథ్‌బాబు సమస్యపై అధికారులతో మాట్లాడి, వారి నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. ఇప్పటివరకు మూడు ప్రమాదాలు జరిగినా, వాటి నియంత్రణలో పోలీసు, రైల్వే, మైనింగ్, రెవిన్యూ, రవాణా శాఖ అధికారులు నిర్లక్ష్యంపై మండిపడ్డారు. రైల్వే పట్టాలకు ప్రమాదం వాటిల్లితే జరిగే ప్రాణ, ఆస్తినష్టాలకు ఎవరు బాధ్యత వహిస్తారని జెడ్‌సితోపాటు అధికారులను ప్రశ్నించి, వారితో వాగ్వాదానికి దిగారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఈ ప్రాంతంలోని మొత్తం క్వారీలను తన అనుయాయుల ద్వారా స్వాధీనం చేసుకుని నడిపిస్తున్నందున, వారి ఒత్తిడి మేరకే అన్నిశాఖల అధికారులు తమకేమీ పట్టన్నట్లు మిన్నకుండడం దుర్మార్గమన్నారు. ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎటువంటి చర్యలేకుండా చేస్తున్నారని, లేకుంటే నామమాత్రపు జరిమానాలతో చేతులు దులుపుకోవడం వల్ల వరుస ప్రమాదఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టడంతోపాటు బాధ్యులెంతటివారైనా వారిపై కఠినచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రమాద కారకులపై చర్యలు తీసుకోవాలి.

విజయరామరాజుపేట రైల్వే బ్రిడ్జి వద్ద సోమవారం తెల్లవారుజామున రెండవసారి ప్రమాదం చోటు చేసుకోవడం విచారకరమని, ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన తర్వాత విలేకర్లతో మాట్లాడుతూ అధిక రాయిలోడుతో భారీలారీ రైల్వే వంతెనను ఢీకొట్టడంతో గడ్డర్లు ధ్వంసమయ్యాయన్నారు. గత మార్చి నెలలో ఇలాంటి సంఘటన జరిగితే ఎంపీ సిఎం రమేష్ చొరవతో తానే స్వయంగా దగ్గరుండి బాగుచేయించానన్నారు. అప్పట్లో గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో ప్రమాదం తప్పిందన్నారు. వరుస ఘటనలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.క్వారీ లారీలను తుమ్మపాల ఏలేరు కాలువ వద్దా బొజ్జన్న కొండమీదగా మళ్ళించి జాతీయ రహదారికి కలపడం ద్వారా ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు.

జెడ్‌సిని ప్రశ్నిస్తున్న సిపిఎం, ఆప్ నేతలు

కార్యకర్తల సంక్షేమమే పార్టీ లక్ష్యం

-హోం మంత్రి అనిత- అట్టహాసంగా నాయకుల ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:టిడిపి కార్యకర్తల సంక్షేమమే లక్ష్యమని, పదవి అలంకారం కాదని, బాధ్యత అని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లి లో మంత్రి కార్యాలయం వద్ద సోమవారం బూత్, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో వివిధ బాధ్యతలు పొందిన నాయకులతో ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించిన మంత్రి అనిత, అనంతరం టీడీపీ సీనియర్ కార్యకర్తలతో జ్యోతి ప్రజ్వలన చేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బూత్, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో వివిధ బాధ్యతలు పొందిన నాయకులతో ప్రమాణస్వీకారం చేయించారు. అట్టహాసంగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. అన్ని అవమానాలను తట్టుకుని ప్రజాస్వామ్యం కోసం పోరాడామని తెలిపారు. ఇటీవలే విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల సమ్మిట్‌లో 13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు వెల్లడించారు. అనకాపల్లి జిల్లాకు అత్యధిక పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. పాయకరావుపేట అభివృద్ధినే తాను లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.కోటఉరట్ల- అడ్డురోడ్డు ఎన్ డి పి రోడ్డు పనులు ఆలస్యమైనప్పటికీ త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో బొమ్మల పరిశ్రమ ఏర్పాటుకు ఇప్పటికే జీ.ఓ జారీ అయిందని, మహిళలకు భారీగా ఉపాధి లభిస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్ళాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

యూనిట్‌ను సందర్శిస్తున్న ప్రాజెక్టు ప్రతినిధులు

పారిశ్రామికవేత్తలుగా మహిళలు రాణించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:పారిశ్రామికవేత్తలుగా మహిళలు రాణించాలని సీఏంసి సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ పద్మిని, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సత్యనారాయణ, ఏటీఎం అనురాధ అన్నారు. జై భవాని గ్రూప్ సభ్యురాలు పోతుల లక్ష్మీ దీపపు ఒత్తులు తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసి, 50 మంది మహిళలకు ఉపాధిని కల్పిస్తూ, మహిళా పారిశ్రామిక వేత్తగా రాణించడంతో సోమవారం స్థానిక ఏపిఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో యూనిట్ ను సందర్శించారు. వ్యాపారవేత్తగా రాణిస్తున్న పోతుల లక్ష్మీ, ఉపాధి పొందుతున్న డ్వాక్రా మహిళలతో మాట్లాడి, వారిని అభినందించారు. ఏపిఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, జై భవాని గ్రూప్ ద్వారా పోతుల లక్ష్మీ కు 3లక్షల రూపాయలు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా 50 వేల రూపాయలు రుణం మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. తద్వారా ఆమె దీపపు ఒత్తుల తయారీ యూనిట్ ను ప్రారంభించి, 50 మహిళలకు ఉపాధి కల్పిస్తుందన్నారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా పురోగతిని సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు దేవినమ్మ, శ్రీను, వివోఏ శేషు కుమారి పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న విఆర్‌ఎలు

సమస్యలపై వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం: గ్రామ రెవెన్యూ సేవకుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఆర్డిఓ కార్యాలయంలో తహసీల్దారు రామారావుకు వినతి పత్రం అందజేశారు. విఆర్ఏలకు పే స్కేలు అమలు చేయడంతో పాటు వారికి పదోన్నతి కల్పించాలన్నారు. 2018 నుంచి రూ.10,500 వేతనంతో కాలం వెలదీస్తున్నామని కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావస్తున్నా నేటికీ తమ సమస్యను పరిష్కరించలేదని గ్రామ రెవెన్యూ సహాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వి.అప్పారావు, నవీన్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ప్రజాశక్తి-గొలుగొండ: ఉద్యమ స్ఫూర్తి ఉన్న వారందరూ ఒకే తాటి పైకి వచ్చి పోరాటాలు చేసినప్పుడే పీడిత ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. గొలుగొండ మండలం చోద్యంలో సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు సంస్మరణ సభను సోమవారం నిర్వహించారు. ముందుగా ర్యాలీగా వెళ్లి రామునాయుడు స్థూపం వద్ద సిపిఐ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఈశ్వరయ్య మాట్లాడుతూ, సమాజంలో ప్రశ్నించే గొంతుకలను హతమార్చడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయన్నారు. ఇటీవల మావోయిస్టులు లొంగిపోయేందుకు సిద్ధపడితే వారిని అకారణంగా అంతమొందించారని తెలిపారు. పల్లెల్లో విద్య వైద్యం అందని ద్రాక్షగా పేద ప్రజానీకానికి మిగిలిందన్నారు. కార్పొరేటు సంస్థలకు వేల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారని విమర్శించారు. రామునాయుడు మృతి పార్టీకే కాకుండా ఈ ప్రాంతానికి తీరని లోటని ఆయనన్నారు. సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జెవి. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రామునాయుడు అతి చిన్న వయసులోనే ఎర్రజెండా చేతపట్టి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.కె రెహమాన్, పైడి రాజు, బాలేపల్లి వెంకటరమణ, అనకాపల్లి సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, గొలుగొండ జడ్పిటిసి సుర్ల వెంకట గిరిబాబు, వైస్ ఎంపీపీ సుర్ల ఆదినారాయణ, సర్పంచ్ శ్రీనివాస్, మహిళా సమైక్య నాయకులు గంగాభవాని, సిపిఎం నాయకులు ఎల్.గౌరి, మండల సిపిఐ కార్యదర్శి జి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

కష్టించి పని చేస్తే గుర్తింపు

- జనసేన సీనియర్ నేత దొరబాబు

మాట్లాడుతున్న దొరబాబు

ప్రజాశక్తి -నర్సీపట్నం:జనసేన పార్టీని గ్రామ, వార్డు స్థాయిలో బలోపేతం చేసుకోవాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.ఎస్.జి.దొరబాబు కోరారు. 4 మండలాలకు చెందిన కార్యకర్తలతో బొడ్డేపల్లి పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ, రాష్ట్ర జనసేన పార్టీ ఆదేశాల మేరకు కొత్త కమిటీ ఏర్పాటు చేసేందుకు ఇంటింటికి సర్వే నిర్వహించి ఔత్సాహికులతో కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కష్ట పడి పని చేసే నాయకులకు, కార్యకర్తలకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. స్థానిక ఎన్నికలపై ఇంటింటా ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ అద్దేపల్లి గణేష్, సహదేవుడు, లంక సత్యనారాయణ, పోతల గణేష్, ఎన్ కిరణ్, ఎస్ కిరణ్, బి మురళి , తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'రైతన్నా.. మీ కోసం'

చీడికాడలో ప్రచారం చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - చీడికాడ :రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు వ్యవసాయ శాఖ, అనుబంధ రంగ శాఖలు కలిసి రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని ఏ కృష్ణవేణి సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ఐదు సూత్రాలను లక్ష్యంగా చేసుకొని, ప్రతి రైతు కుటుంబాన్ని సందర్శించి వారికి వ్యవసాయ రంగంలో సుస్థిర అభివృద్ధి సాధించడానికి అవగాహన కల్పిస్తామన్నారు.

రావికమతం: రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ఈనెల 29 వరకు అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా నిర్వహించినట్లు సోమవారం మండల వ్యవసాయ అధికారి రమేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమం కొరకు మండలంలో రెండు టీఎంలను ఏర్పాటు చేశామన్నారు.

బుచ్చయ్యపేట : యూరియా వినియోగంతో పంటలకు తెగుళ్లతో పాటు ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, యూరియా వినియోగాన్ని తగ్గించాలంటూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలో గల పలు గ్రామాల్లో అవగాహన కల్పించారు. యూరియా అధికంగా వినియోగించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు.

అనకాపల్లి : జిల్లావ్యాప్తంగా ఈనెల 24 నుంచి 29 వరకు జరిగే రైతన్న మీకోసం వారోత్సవాల కరపత్రాలను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయకృష్ణన్ ఆవిష్కరించారు. జిల్లాలో 450 రైతు సేవా కేంద్రాల ద్వారా బందాలుగా ఏర్పడి, 16,431 రైతు కుటుంబాలను కలిసి, 57,888 మంది రైతులకు వ్యవసాయ పంచ సూత్రాలపై విశదీకరిస్తారన్నారు. డిఆర్ఓ వై. సత్యన్నారాయణ రావు, జిల్లా వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ అధికారులు ఆశా దేవి, మోహన్ రావు పాల్గొన్నారు.

పాయకరావుపేట : పెద రామభద్రపురం గ్రామంలో రైతులతో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖాముఖి నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి రైతులతో వివిధ అంశాలపై చర్చించారు. రైతు వారోత్సవాలలో ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించారు.

కె. కోటపాడు : రైతన్న మీకోసం కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ పాల్గొనారు. అన్ని గ్రామాల్లో రైతు కుటుంబాలను కలిసి వారికి వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యక్రమాలు పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

యలమంచిలి టౌన్ : పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో రైతన్న మీకోసం కార్యకరమంలో ఏఓ మోహనరావు పాల్గొన్నారు. ఈనెలాఖరు వరకు రైతు కుటుంబాలను కలిసి, వారి నుంచి సేకరించిన విషయాలను ఏపి ఏఐఎంఎస్ (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సర్వీస్) అనే యాప్‌లో నమోదు చేస్తామన్నారు. వెటర్నరీ డాక్టర్ కన్నం నాయుడు, విస్తరణాధికారులు నారాయణరావు, నూకరాజు పాల్గొన్నారు.

అనకాపల్లి :బొలువాడ గ్రామాన్ని జిల్లా వ్యవసాయఅధికారి ఆశాదేవి, డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయ అధికారి పి రంగాచారి సందర్శించి రైతులతో ముఖాముఖి నిర్వహించి, వ్యవసాయ పథకాలపై చర్చించారు. కార్యక్రమంలో బొలువాడ ఎంపిటిసి తోట విజయ్, నీటి వినియోగదారు సంఘం ఉపాధ్యక్షుడు రమణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పలరాజు, సత్యారావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు పవన్,పాల్గొన్నారు.

తగరపువలస : భీమునిపట్నం మండలం తాటితూరు గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని ఎంపిడిఓ నరసింహారావు ప్రారంభించారు. రాబోయే ఐదేళ్లలో రైతును రాజు చేసేందుకు 5 విధానాలతో కార్యాచరణ చేస్తున్నామని తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర నిర్ణయాలతో ప్రభుత్వం ముందుకెళ్తుందని చెప్పారు. ఏయే పంటలను ఏ విధంగా పండించాలో తెలియజేశారు. విత్తనాల గురించి మండల వ్యవసాయాధికారి శివ కోమలి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాసంతి, శ్రీనివాస్, కీర్తిప్రసాద్, పతివాడ రాంబాబు, కొమర రాము పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలంలోని పలు గ్రామాల్లో రైతన్న మీకోసం' సర్వేను ప్రారంభించారు. భూమి కలిగిన ప్రతి రైతు ఇంటినీ గ్రామస్థాయి బృందాలు సందర్శించి సమాచారం సేకరించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సంధ్యా రత్నప్రభ తెలిపారు. బోని, వెల్లంకిలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, కుసులవాడలో జరిగిన కార్యక్రమంలో ఎడి విజయప్రసాద్, వెల్లంకిలో ప్రకృతి వ్యవసాయ డిడి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో అవగాహన కల్పిస్తున్న నేతలు

ఘనంగా విజయ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -నర్సీపట్నం:తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ జన్మదిన వేడుకలు నర్సీపట్నంలో అబిద్ సెంటర్ వద్ద కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయ్ భారీ కటౌట్‌కు క్రేన్ సహాయంతో పూలమాలను వేశారు. అనంతరం కేకు కట్ చేసి అభిమానులకు పంచారు, అనంతరం ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రికి వెళ్లి రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. అన్నపూర్ణ అక్షయపాత్ర వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. బొడ్డుపల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వెలగా వెంకటకృష్ణారావు సొంత ఖర్చులతో ఆర్వో వాటర్ ప్లాంట్ ను వినియోగంలోకి తీసుకువచ్చారు, ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, వైస్ కమిటీ చైర్మన్ చిటికెల కన్నయ్య నాయుడు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న నేతలు

సిఎంను కలిసిన విజయ్

తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ జన్మదిన సందర్భంగా సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విజయవాడలో కలిసి ఆయన ఆశీస్సులు అందుకున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని
ఖాళీ బిందెలతో మహిళల భిక్షాటన

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలో తాటిపర్తి పంచాయతీ లక్ష్మీపేట గ్రామానికి చెందిన గిరిజన మహిళలు ఇంటింటి కొలాయి ఏర్పాటు చేయాలని ఖాళీ బిందెలతో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఆదివాసి గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి వీరికి మద్దతుగా మాట్లాడుతూ, లక్ష్మీపేట గ్రామంలో సుమారు 15 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ఈ గిరిజన గ్రామంలో నెల రోజుల నుండి మంచి నీరుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో ఉన్న ఒక బోరు నుంచి నీరు రాకపోవడంతో గిరిజనులు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామస్తుల సొంత నిధులతో బోరు రిపేరు చేయిస్తున్నారన్నారు. 2023లో సంవత్సరంలో ఇంటింటి కొళాయిలు ఇస్తామని అధికారులు రిగ్గుతో బోరు తీయడం జరిగిందే తప్ప ఇంతవరకు ఇంటింటి కుళాయి ఏర్పాటు చేయకపోవడంతో గిరిజన మహిళలు, పశువులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. స్కూల్లో ఉన్న మోటార్ మంచినీరు, పామాయిల్ తోటలో ఉన్న మోటార్ నీరుని వాడుతున్నారని, తక్షణమే బోరు బాగు చేసి తాగునీరు అందించి ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఖాళీ బిందెలతో ఎంపిడివో కార్యాలయం వద్ద గ్రామస్తులతో నిరసన చేపడతామని నరసింహమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో తామర్ల లక్ష్మి, ఉయ్యాల. చిన్నమ్ములు, తామర్ల చిన్నమ్ములు, ఆగరి. పోతురాజు, వరహాలమ్మ పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో భిక్షాటన చేస్తున్న నరసింహమూర్తి, గిరిజన మహిళలు

రిజర్వాయర్‌లో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-రావికమతం: రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ కళ్యాణపులోవ రిజర్వాయర్లో గల్లంతయిన యువకుడు మృతదేహం సోమవారం లభ్యం అయ్యింది. కొత్తకోట గ్రామానికి చెందిన గుమ్మడి వాసు (29) ఆదివారం రిజర్వాయర్లో దిగి గల్లంతయిన విషయం తెలిసిందే. సహచర కూలీలతో ఆదివారం రిజర్వాయర్లో స్నానానికి దిగిన వాసు ఒడ్డుకి చేరకపోవడంతో మిగిలిన కూలీలు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. చీకటి పడడంతో గాలింపు చర్యలు తాత్కాలికంగా నిలిపివేశారు. సోమవారం ఉదయాన్నే గాలింపు చర్యలు తిరిగి కొత్తకోట ఎస్సై శ్రీనివాసు ఆధ్వర్యంలో రావికమతం అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్ళ సహాయంతో చేసి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసుకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించడం జరిగిందని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

సర్వే చేపడుతున్న అధికారులు

ఉర్లోవలో సర్వే ప్రారంభం

ప్రజాశక్తి -రావికమతం: ఉర్లోవ రెవెన్యూలో సర్వే కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వే కమిటీ ద్వారా సోమవారం సర్వే ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా వి మాడుగుల మండలం ఉర్లోవ రెవిన్యూ పరిధిలో రావికమతం మండలానికి చెందిన కవగుంట, బుడ్డి బంద, కొమిర, మచ్చిపురం, గ్రామాలకు చెందిన సుమారు 222 మంది రైతులు సుమారు 345 ఎకరాలు డి ఫామ్ భూములలో జీడి మామిడి తోటలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఉర్లోవ రెవిన్యూ విలేజ్ నెంబర్ 55 వెబ్లాండ్లో నమోదు కాలేదు. ఈ విషయమై కొమిర రైతులు, పేదలు దళితులు ఇటీవల సీసీఎల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ విజయలక్ష్మికు వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయాలని వినతి పత్రం అందజేసినట్లు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు తెలిపారు. దీని ఫలితంగా సోమవారం కవగుంట, బుడ్డి బంద, కొమెర, గ్రామాల్లో ఫీల్డ్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు కమలమ్మ, సింహాచలమ్మ, సర్వేయర్ భాష, సురేష పాల్గొన్నారు.

రోడ్డులో కూరుకుపోయిన లారీ

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట తహశీల్దార్ కార్యాలయ కూడలి వద్ద ఆర్అండ్‌బి రోడ్డుపై ఏర్పడ్డ భారీ గోతులో లారీ కూరుకు పోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. జేసిబి సాయంతో లోడుతో ఉన్న లారీని పైకి తీశారు. ఈ మేరకు సోమవారం ఎంపిడిఒ వి.నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ సురేష్, ఎస్సై రామకృష్ణారావు, రోలుగుంట గ్రామ కార్యదర్శి ఆ గొయ్యిని పరిశీలించారు. ఎస్సై చొరవతో స్టోన్ క్రషర్ డస్టును తెప్పించి గొయ్యిని పూర్తి వేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

25న క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ

ప్రజాశక్తి-రోలుగుంట:ఈ నెల 25న రోలుగుంట మండల పరిషత్ కార్యాలయంలోని వెలుగు సమాఖ్య సంఘ సభ్యులకు క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపిడిఒ వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంఘ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.

ప్రజాదర్బార్‌లో అనకాపల్లి నేతలు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్: మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమం అనకాపల్లి జిల్లా నాయకులు ఆధ్వర్యంలో జరిగింది. పలు కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లుగా వ్యవహరిస్తున్న యలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, అనకాపల్లి టిడిపి ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ పాల్గొని, తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ప్రజల నుండి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు నివేదించారు.

రైవాడలో కొనసాగిన గాలింపు

-లభ్యం కాని ఇద్దరి ఆచూకీ

ప్రజాశక్తి-దేవరాపల్లి,అనంతగిరి:అనంతగిరి మండలం జీనబాడులో రైవాడ జలాశయంలో గల్లంతైన ఇద్దరి యువకుల కోసం చేపట్టిన గాలింపు చర్యలు సోమవారం రెండో రోజూ ఫలితం ఇవ్వలేదు. సోమవారం ఉదయం 6 గంటలకు ఏపీ ఎస్‌డిఆర్ఎఫ్ 23 మంది సిబ్బంది సీఐ టీ. రామకృష్ణ నేతృత్వంలో రెండు బృందాలుగా ఏర్పడి స్టీమ్ బోట్లతో గంటల తరబడి జలాశయంలో గాలింపు చేపట్టినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఫారెస్ట్ రేంజర్, అనంతగిరి తహశీల్దార్ వెంకటాచారి, ఎస్సై డి.శ్రీనివాసరావులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఆదివారం లభించిన జీవన్ మృతదేహానికి గ్రామంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. గాలి అప్పలరాజు, దబారి రమేష్ ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబాలు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు.కుటుంబ సభ్యుల ఆందోళనతో తహశీల్దార్‌తో కూడిన అధికార బృందం వారితో మాట్లాడి పరిస్థితిని శాంతింపజేశారు.

గాలిస్తున్న రెస్క్యూ సిబ్బంది

భోగలింగేశ్వరుని సన్నిధిలో జయ రాజశేఖర్

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్: సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వర స్వామిను సోమవారం అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర స్టాఫ్ సెలక్షన్ రాష్ట్రస్థాయి సెక్రటరీ, అనకాపల్లి వాసి యల్లపు వరాహ వెంకట జయరాజశేఖర్ దంపతులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ , అర్చకులు పేరూరి చిన్నస్వామి, క్రీ శివన్నారాయణ, సత్యనా రాయణ పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్‌కు ఎస్ఎస్ఎ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వి.పుండరీ, కార్యదర్శి ఎల్.చైతన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.గణపతి డిమాండ్ చేశారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, మినిమం టైం స్కేల్ (ఎంటిఎస్) అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన సమ్మె ఒప్పందాలను పూర్తిగా అమలు చేయాలన్నారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ, హెల్త్ బెనిఫిట్స్, మెడికల్ లీవులు, చైల్డ్ కేర్ లీవులు ఇవ్వాలన్నారు. ఏడేళ్లుగా వేతన సవరణ జరగలేదని, తక్షణం వేతన సవరణ చేపట్టాలని కోరారు. ఈ డిమాండ్లను నెరవేర్చకుంటే విజయవాడలో భారీ స్థాయిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అనురాధ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

అనకాపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జెఎసి పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్త నిరసనలలో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద పోరాట దీక్ష ఆందోళన చేపట్టారు. ఏపి కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు పూడి వెంకట్రావు, టి కృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 22 రోజుల సమ్మె పోరాట ఫలితంగా వేతనాల పెంపు కొన్ని విభాగాలకు వర్తించలేదన్నారు. సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయకపోవడంతో ఆందోళన చేపట్టామన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లో పర్మినెంట్ లేదా ఎంటిఎస్ అమలు హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల అమలు, ఉద్యోగ విరమణ వయస్సు 62ఏళ్లకు పెంపు, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగ భద్రత, ఇతర హామీలను అమలు చేయకుంటే వచ్చేనెల 10న ఎస్‌పిడి కార్యాలయం వద్ద ఆందోళన తప్పదనిహెచ్చరించారు. కార్యక్రమంలో పి సతీష్, నూకేష్, వెంకటలక్ష్మి ,సంతోషి, నాయుడు, వరప్రసాద్ తదితరులు నాయకత్వం వహించారు. అనంతరం కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు.

విశాఖలో ఆందోళన చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ : ఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాజీ మార్గంలో కేసుల సత్వర పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వచ్చేనెల 13న నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. వివిధ న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్‌లో ఉన్న సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్ మనీ రికవరీ కేసులు, మోటార్ వాహన ప్రమాద నష్టపరిహార కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కుటుంబ తగాదాలు, కార్మిక పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవాలని, తద్వారా కక్షిదారులు తమ విలువైన సమయాన్ని ఆదాతోపాటు న్యాయ ప్రక్రియ వేగవంతం చేసేందుకు సహకరించాలని సూచించారు. పోలీసు శాఖ ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సహాయాన్ని అందిస్తుందన్నారు. వివరాలకు విశాఖపట్నంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, జిల్లా కోర్టు ప్రాంగణంతోపాటు అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల మండల న్యాయ సేవా సంఘాలలో సంప్రదించాలన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యం

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : పట్టణంలోని యర్రవరం గ్రామంలో సిఎ ఎం సుధారాణి ఆధ్వర్యంలో శ్రీదుర్గమ్మ సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. వార్షిక నివేదిక, వార్షిక ప్రణాళిక, ఆర్థిక ప్రణాళికపై డ్వాక్రా మహిళలకు వివరించారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలనే లక్ష్యంతో మెప్మా ఎలోహెచ్‌పి సెల్ ప్రారంభించారు. ఈ సెల్ ద్వారా బ్యాంకు రుణాలు పొంది ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌పి టి.ఉమ, సచివాలయ, మెప్మా సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.